సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం ၊ 14 ၊ నవంబర్ ၊ 2023



బాస్కెట్‌బాల్ విజేత రంగారెడ్డి

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రంగారెడ్డి జట్లు విజేతగా నిలిచాయి.

వివరాలు 10లో ▸



కురుమూర్తిరాయ..

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /20.9

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రికి దట్టమైన మేఘాలు కమ్ముకుంటాయి. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



గద్వాల రూరల్: సాధారణ శాసనసభ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులందరూ కృషి చేయాలని ఎన్నికల పరిశీలకులు పి.వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయనకు ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌లు సాదారంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా పరిశీలకులు ఐడీవోసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీ–విజిల్ కేంద్రం, కంట్రోల్ రూం, ఎంసీఎంసీ కేంద్రం, మీడియా కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు అవసమైన చర్యలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లిక్కర్, కానుకలు, డబ్బు తరలింపు వాటిపై ప్రత్యేక నిఘా వేసి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎవరైన ఫిర్యాదు చేయాలనుకుంటే నేరుగా సెల్ నం.6300332716కు ఫోన్ చేయవచ్చన్నారు. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, గద్వాల నియోజకవర్గానికి సంబంధించి సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ఫోన్ ద్వారా కాని లేదా రేవులపల్లిలోని జెన్‌కో గెస్ట్ హౌస్‌లో నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణ స్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్వాల పట్టణంలోని కాకతీయ టెక్నో స్కూల్ యజమాన్యం ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు ఉచిత అన్నదానం సౌకర్యం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు మధుసూధనాచారి, రవిచారి, నాగరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.



అంజన్న నామస్మరణతో మార్మోగిన బీచుపల్లి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఎర్రవల్లిచౌరస్తా: అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అంజనేయస్వామి ఆలయం సోమవారం అంజన్న నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అభయాంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృత అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అభయాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం ఎదుట కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ఈఓ రామన్‌గౌడ్ పేర్కొన్నారు.




ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వాదం.. ఎవరికి ఆమోదం!

- కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారంపై ప్రజల్లో చర్చ
- సీడ్, రియల్ మాఫియాతో దోస్తీపై ఆగ్రహావేశాలు
- ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యంపై నాయకుల్లోనూ అసహనం
- బహుజనవాదం సమాధి చేస్తున్నారని మండిపాటు
- సామాజిక మాధ్యమాల్లో విమర్శల వెల్లువ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల రూరల్: ఎన్నికల్లో తొలిఘట్టం నామినేషన్ల పర్వం ముగియడంతో పాలమూరులో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఎవరికి వారు వ్యూహాత్మకంగా అడుగులేస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 14 నియోజకవర్గ స్థానాలు ఉండగా.. ఎక్కడా లేని విధంగా గద్వాలలో తెరపైకి వచ్చిన బహుజన వాదం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 70 ఏళ్ల చరిత్రలో ఈసారి ఎన్నికల్లో డీకే అరుణ కుటుంబం పోటీకి దూరంగా ఉండగా.. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీతో పాటు ఏఐఎఫ్‌బీ పార్టీలు నువ్వా.. నేనా అన్నట్లు పోటాపోటీగా ఎన్నికల పోరులో దూసుకెళ్తున్నాయి. సోషల్ మీడియాను సైతం ఆయా పార్టీల అభ్యర్థులు విస్తృతంగా వినియోగించుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎవరికి వారు తమకు అనుకూల పోస్టులతో హల్‌చల్ చేస్తుండగా.. హస్తం అభ్యర్థి స్థానికత హాట్‌టాపిక్‌గా మారింది. అంతేకాదు.. గద్వాల్లో కాంగ్రెస్‌కు ప్రధానంగా ఊపిరిపోసిన బహుజనవాదం.. అభ్యర్థి, ముఖ్య నేతల వ్యవహార శైలి, కాలక్రమంలో మారుతున్న పరిస్థితుల్లో ఆ పార్టీకి గుదిబండగా మారినట్లు తెలుస్తోంది.

నడిగడ్డలో రసవత్తరంగా రాజకీయం



సీడ్ మాఫియాతో చీకటి ఒప్పందం..

నడిగడ్డ రాజకీయాల్లో సీడ్ మాఫియాది ప్రత్యేక స్థానం. ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్న వారు ఏళ్లకేళ్లుగా తమకు అనుకూలమైన అభ్యర్థులకు వంతపాడడమే కాకుండా.. వారికి ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తున్నట్లు ఇది వరకే ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా సీడ్, రియల్, మట్టి తదితర మాఫియాను పారదోలుతామని స్థానిక కాంగ్రెస్ నేతలు పార్టీ అభ్యర్థుల ప్రకటనకు ముందు ప్రచారం చేశారు. అయితే అనూహ్యంగా బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీచైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య కాంగ్రెస్‌లో చేరగా.. ఆమెనే అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిణామాల క్రమంలో సీడ్ మాఫియా నేతలతో వారు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండడం చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. సబ్ ఆర్గనైజర్లతో అంటకాగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారగా.. నడిగడ్డ రైతుల్లో కాకరేపుతోంది.

మైనస్‌గా మారుతోందా?

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం తన సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు లక్ష్యంగానే కొనసాగుతున్నట్లు గద్వాల పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో చర్చ జరుగుతోంది. అంతే కాదు.. పార్టీలో అనేక ఏళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్న వారిని కాకుండా తన సామాజిక వర్గానికి చెందిన నాయకులకే బాధ్యతలు అప్పగించడం మైనస్‌గా మారు తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కే చెందినప్పటికీ తాము ఓటర్లం కాదన్నట్లు వ్యవహరిస్తుండడం మల్దకల్‌తో పాటు పలు మండలాలకు చెందిన కుటుంబాలు మథనపడు తుండగా.. జనంలో బహుజన వాదం.. ఎవరికి ఆమోదమనే చర్చ జోరుగా సాగుతోంది.

ఏఐఎఫ్‌బీ పదునైన విమర్శలు..

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్ కుమార్ వర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై పదునైన ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా సరిత నాలుగేళ్ల పాటు అధికార పార్టీలో ఉంటూ ఏ ఒక్క రోజు కూడా బహుజనుల కోసం భుజం కాసింది లేదని.. ఎందరో బలైనా వారి తరఫున కనీసం ప్రశ్నించిన దాఖల లేవని విమర్శలు ఎక్కుపెడుతున్నారు. నాలుగేళ్ల పాటు అధికార పార్టీలో అధికారాన్ని అనుభవించి కేవలం అధికారం కోసం జిమ్మిక్కులు చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. సీడ్ మాఫియా, రెడ్లతో మిలాఖత్ అయ్యి గద్వాలలో బహుజనవాదాన్ని సమాధి చేయడానికే పోటీ చేస్తున్నారనే ఘాటైన విమర్శనాస్త్రాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండడం మెజార్టీ బహుజన వాదుల్లో తీవ్ర చర్చకు దారితీయగా.. కాంగ్రెస్‌కు ఇరకాటం తెచ్చిపెట్టినట్లయింది. కాంగ్రెస్‌లో అభ్యర్థి ప్రకటన సమయంలో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు టికెట్ కొనుక్కున్న నాయకురాలు ప్రజాసేవ చేయగలదా.. గద్వాలలో బహుజనవాదాన్ని సమాధి చేయడానికే ఆమె వచ్చిందంటూ విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. తాజాగా ఎన్నికల తొలి ఘట్టం ముగిసిన క్రమంలో సోషల్ మీడియాలో ఫొటోలు, పేర్లతో సహా కాంగ్రెస్ అభ్యర్థిపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

నయీం పేరిట సైతం..

కాంగ్రెస్‌ను 'బంధువుల' బెడద వెంటాడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి కుటుంబ సభ్యుడిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు వ్యక్తి గతంలో హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో నయీం గ్యాంగ్‌తో కలిసి భూదందాలు, సెటిల్మెంట్లకు తెగబడినట్లు సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వైరల్‌గా మారాయి. మూడేళ్ల క్రితం గట్టు మండలంలో పోలీస్ కేసు నమోదుకు సంబంధించి సీఐతో ఫోన్‌లో బెదిరింపు ధోరణితో మాట్లాడుతూ దళితులను పరుష పదజాలంతో సదరు వ్యక్తి ఉచ్చరించిన విషయాన్ని ప్రతిపక్షాలు అస్త్రంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. నడిగడ్డపై నయీమ్ గ్యాంగ్ అంటూ సోషల్ మీడియాలో పోస్టర్లు వైరల్ కాగా.. కలకలం రేపుతున్నాయి.

హ్యాండ్‌బాల్ చాంపియన్ పాలమూరు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి అండర్–19 హ్యాండ్‌బాల్ టోర్నీలో బాలుర విభాగంలో ఆతిథ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సత్తాచాటి చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌లో జిల్లా జట్టు 22–12 గోల్స్ తేడాతో కరీంనగర్‌పై విజయం సాధించింది. వరంగల్ జట్టు మూడోస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో వరంగల్ చాంపియన్‌గా నిలిచింది.ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 11–4 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్‌పై విజయం సాధించగా.. మూడోస్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది.

విజేత జట్లకు బహుమతుల ప్రదానం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ విన్నర్, రన్నరప్, థర్డ్‌ప్లేస్ జట్లకు ట్రైబల్ వెల్ఫేర్, ఈఎంఆర్‌ఎస్ మాజీ క్రీడల అధికారి రమేశ్‌కుమార్, టోర్నీ రాష్ట్ర పరిశీలకులు జగన్‌మోహన్‌గౌడ్, అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్లు విజేతగా నిలవాలన్నారు. ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని సూచించారు.

❒ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేశారు. ఇందులో బాలుర జట్టులో ఐదుగురు, బాలికల జట్టులో ముగ్గురు ఉన్నారు. బాలుర జట్టుకు ధన్‌రాజ్‌గౌడ్, జునేద్, రోహిత్ భార్గవ్, చరిత్‌రెడ్డి, కౌషిక్ (మహబూబ్‌నగర్), మధు రోహిత్, సాయి, సాయి కార్తీక్, రూబి రతన్ (కరీంనగర్), జితేందర్, సాయికృష్ణ (వరంగల్), రఫియుద్దీన్, ఉదయ్ (మెదక్), సాయితేజ (రంగారెడ్డి), బాబా సాహెబ్ (హైదరాబాద్), రాంకుమార్ (ఆదిలాబాద్), బాలికల జట్టుకు సుదీక్ష, జ్యోతి, సంధ్య, వైష్ణవి (వరంగల్), కె.జ్యోతి, శివాణి, తన్మయి (మహబూబ్‌నగర్), క్రిష్ణవేణి, మీనాక్షి (ఖమ్మం), సాయిసంజన (రంగారెడ్డి), అక్షయ (మెదక్), వర్ష, నవనీత (నిజామాబాద్), శ్రావ్య (కరీంనగర్), అతీఫా సుల్తానా (నల్గొండ), సంధ్య (హైదరాబాద్) ఎంపికయ్యారు.

12 తిరస్కరణ

- ముగిసిన నామినేషన్ల పరిశీలన
- అలంపూర్‌లో నామినేషన్లపై అభ్యంతరాలు.. రగడ
- జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మొత్తం 50 నామినేషన్లు దాఖలు..
- 15 వరకు ఉపసంహరణకు గడువు



గద్వాలలో స్క్రూటినీ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్

గద్వాల రూరల్/అలంపూర్: శాసనసభ ఎన్నికలకు సంబంధించి తొలిఘట్టమైన నామినేషన్ల పర్వంలో ప్రధాన అంకం స్క్రూటినీ ప్రక్రియ పూర్తయింది. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారం పూర్తయింది. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో కలపి మొత్తం 50 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా, వీరిలో 12 మంది అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టారు. గద్వాల రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ పర్యవేక్షించారు.

గద్వాలలో ఐదు తిరస్కరణ

గద్వాల నియోజకవర్గ పరిధిలో మొత్తం 25మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా అందులో ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లను వివిధ రకాల కారణాలతో తిరస్కరించారు. దీంతో గద్వాల అసెంబ్లీ పరిధిలో మొత్తం 20మంది బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ తెలిపారు.

అలంపూర్‌లో ఏడు..

అలంపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 25 మంది అభ్యర్థులు 47 సెట్‌ల నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ తెలిపారు. వాటిని పరిశీలించగా ఏడు నామినేషన్‌లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. 18 మంది అభ్యర్థుల నామినేషన్‌లు ఆమోదం పొందినట్లు పేర్కొన్నారు.

అలంపూర్‌లో ఆమోదించిన అభ్యర్థుల వివరాలిలా..

అభ్యర్థి పేరు	పార్టీ
విజయుడు	బీఆర్‌ఎస్
ఎస్‌ఏ సంపత్ కుమార్	కాంగ్రెస్
పేరమాళ్ల రాజగోపాల్	బీజేపీ
ఆర్‌ఎస్ ప్రసన్న కుమార్	బీఎస్పీ
అయ్యప్పగారి సునీల్	భారత చైతన్య యువజన పార్టీ
ప్రేమలత	తెలంగాణ రాజ్యసమితి
మద్దిలేటి	ఆలిండియా సమతా
రాజా రమేష్	యుగ తులసి
లక్ష్మన్న	ధర్మ సమాజ్
ఆర్‌పి లింగన్న	ఆలిండియా ఫార్వర్డు బ్లాక్
గోపాల్	ఇండిపెండెంట్
పేరపోగు ప్రసంగి	ఇండిపెండెంట్
బీసన్న	ఇండిపెండెంట్
బంగిలక్ష్మన్న	ఇండిపెండెంట్
ఎన్‌వి మేరమ్మ	ఇండిపెండెంట్
రాజు	ఇండిపెండెంట్
హెచ్ విజయ్ కుమార్	ఇండిపెండెంట్
హెచ్ విజయ్ బాబు	ఇండిపెండెంట్

గద్వాలలో ఆమోదించిన అభ్యర్థుల వివరాలిలా..

అభ్యర్థి పేరు	పార్టీ
అతికూర్ రహమాన్	బీఎస్పీ
బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి	బీఆర్‌ఎస్
శివారెడ్డి	బీజేపీ
సరిత	కాంగ్రెస్
కె.కృష్ణ	భారతీయ స్వదేశీ కాంగ్రెస్
జి.రంజిత్‌కుమార్	ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్
మలిచేటి వెంకట్‌రెడ్డి	విద్యార్థుల రాజకీయ పార్టీ
జి.సరిత	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ
సుబ్బారావు	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
బూడిద అనిల్‌కుమార్	స్వతంత్ర అభ్యర్థి
బి.ఈశ్వర్	ఇండిపెండెంట్
బీఆర్.తిమ్మప్ప	ఇండిపెండెంట్
ఈడిగ పరమేశ్వర్‌గౌడ్	ఇండిపెండెంట్
ఉప్పరి రవికుమార్	ఇండిపెండెంట్
రాఘవేంద్రుడు	ఇండిపెండెంట్
రాజు గద్దెగోత్రం	ఇండిపెండెంట్
ఎన్. వెంకటేష్‌నాయక్	ఇండిపెండెంట్
కె.శ్రీనివాసులు	ఇండిపెండెంట్
కె.శ్రీనివాసులు	ఇండిపెండెంట్
సరిత	ఇండిపెండెంట్

గద్వాలలో తిరస్కరణకు గురైన వారి వివరాలు

అభ్యర్థి	పార్టీ	తిరస్కరణకు కారణం
పరుమాల కృష్ణ	బీఎస్పీ	బీ–ఫామ్ సమర్పించలేదు
బండ్ల జ్యోతి	బీఆర్‌ఎస్	డమ్మీ అభ్యర్థిగా వేయడం
చిన్న తిరుపతయ్య	ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	డమ్మీ అభ్యర్థిగా వేయడం
సురేంద్ర	బీఎస్పీ	బీ–ఫామ్ సమర్పించలేదు
హనుమంతు	ఇండిపెండెంట్	సరైన ప్రపోజల్స్ లేకపోవడం

అలంపూర్‌లో తిరస్కరణకు గురైన వారి వివరాలు

అభ్యర్థి	పార్టీ	తిరస్కరణకు కారణం
కుర్వ చిన్న మల్లయ్య	బీజేపీ	ఏ, బీ ఫాంలు సమర్పించకపోవడం
మాదన్న	బీజేపీ	ఏ, బీ ఫాంలు సమర్పించకపోవడం
మాకుల చెన్నకేశవరావు	బీఎస్పీ	ఏ, బీ ఫాంలు సమర్పించకపోవడం
రాజన్న	బీఆర్‌ఎస్	బీ ఫాం అందించకపోవడం
ఎం ఆంజనేయులు	ఇండిపెండెంట్	ప్రతిపాదకుల సంతకాలు సమర్పించకపోవడం
వి శేషు	ఇండిపెండెంట్	ప్రతిపాదకుల సంతకాలు సమర్పించకపోవడం
సంపత్ కుమార్	ఇండిపెండెంట్	ప్రతిపాదకుల సంతకాలు సమర్పించకపోవడం

నామినేషన్ పరిశీలనలో దుమారం



అలంపూర్‌లో నామినేషన్ కేంద్రం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఉద్యోగ వివరాలపై కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల ఫిర్యాదు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఉత్కంఠ

అలంపూర్ /అలంపూర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్ల పరిశీలనలో దుమారం రేగింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్‌పై ఇతర పార్టీల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో, అఫిడవిట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన వివరాలు పొందుపర్చలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠత కొనసాగింది. అలంపూర్ తహసీల్దార్ కార్యాలయంలోని అసెంబ్లీ ఎన్నికల బరిలో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడి నామినేషన్ పరిశీలన సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్ కుమార్, బీజేపీ అభ్యర్థి రాజగోపాల్, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న కుమార్‌తోపాటు ఇతర అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడి నామినేషన్, అఫిడవిట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన వివరాలు, రాజీనామా చేసిన కాఫీని పొందపర్చలేదని ఎన్నికల నిబంధనల మేరకు తిరస్కరించాలని రిటర్నింగ్ అధికారిని కోరినట్లు తెలిపారు. కానీ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి అమోదించినట్లు చెప్పారు. దీంతో అభ్యర్థులు కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖీతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బయటికి వెళ్లడానికి వాహనం వద్దకు రాగా వారు అడ్డుపడుతూ.. నామినేషన్‌ను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సాధరణ అబ్జర్వర్ వసంత్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. దీంతో అక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులతో మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్ కేంద్రం వద్దనే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండటంతో ఉత్కంఠత కొనసాగింది. అనంతరం ఫిర్యాదు చేసిన అభ్యర్థులు బయటికి వచ్చి ప్లకార్డులను ప్రదర్శించారు. నామినేషన్‌ల పరిశీలనలో ఉత్కంఠత నెలకొనడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అలంపూర్ సీఐ రాజు, శాంతినగర్ సీఐ శివకుమార్ గౌడ్‌లు ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకోని పర్యవేక్షించారు.



కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు

17న జిల్లాకు కేంద్ర మంత్రి అమిత్‌షా రాక

గద్వాల రూరల్: ఈ నెల 17వ తేదీన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా గద్వాలకు రానున్నట్లు బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారని గద్వాలలో బహిరంగ సభలో పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిధంగా కర్నాటక మాజీ ముఖ్యమంత్రి శ్రీరాములయ్య ఈనెల 15వ తేదీన గద్వాలకు రానున్నట్లు తేరుమైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామాంజనేయులు, సంజీవ్‌భరద్వాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనం మనకోసం చేసేది మనతోనే అంతరించిపోతుంది.. ఇతరుల కోసం చేసేది శాశ్వతంగా నిలిచి ఉంటుంది.
- గాంధీజీ

బ్యాలెట్ బాక్స్ గుర్తుందా..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఒకప్పుడు ఇనుప పెట్టె (బ్యాలెట్ బాక్స్) వినియోగించేవారు. పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఇనుప పెట్టెలను ఎన్నికల సిబ్బంది గోనె సంచుల్లో తీసుకుని గ్రామాలకు వెళ్లేవారు. ఓటర్లు విధిగా అభ్యర్థికి కేటాయించిన పెట్టెల్లోనే ఓటు వేయాల్సి ఉండగా.. గెలుపొందేంది ఎవరనే విషయం ముందుగానే తెలిసేది. ఈ విధానంతో ఎన్నికలు ఎలాంటి హడావిడి లేకుండా సజావుగా జరిగేవి.

సంస్కరణలతో మార్పు..: 1982లో ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగం ప్రారంభం కావడంతో ఓటింగ్‌లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. సిబ్బందికి శారీరక శ్రమ తగ్గింది. అలాగే ఓటింగ్ అక్రమాలకు తెర పడిందని చెప్పవచ్చు.

- జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)



ప్రచార హోరు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. నిబంధనల ప్రకారం ప్రచారం చేసుకోవాలని ఎన్నికల అధికారులు అభ్యర్థులకు అనుమతులు ఇస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓట్లు అభ్యర్థిస్తూ ఊరూరా వీధుల్లో తిరుగుతున్నారు. డప్పు చప్పుళ్లు, సౌండ్ బాక్సులు, ప్రసంగాలతో హోరెత్తిస్తున్నారు. పోటాపోటీగా పటాకుల మోత మోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రార్థనా మందిరాలు, విద్యాలయాలను సైతం పట్టించుకోకుండా ప్రచారం చేస్తున్నారు. పాఠశాలల ఎదుట ప్రచార రథాలను నిలిపి మోత మోగిస్తున్నారు. సినిమా పాటల తీరుగా ప్రచార గీతాలు ఉండటంతో విద్యార్థులు తరగతి గదుల్లో ఏకాగ్రత పెట్టలేకపోతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం శబ్ద తీవ్రత పెరిగినా కేసులు నమోదు చేయాలి. విద్యాలయాలు, వైద్యశాలలు, న్యాయస్థానాలు ఉన్న ప్రాంతాల్లో శబ్ద తీవ్రత నియంత్రణలో ఉండాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎన్నికల సిత్రాలు..



గరంగరం చాయ్.. తాగేసేయ్..

బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో టీ తయారు చేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. - మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

ఇస్త్రీ.. ఇరగదీస్తా.!



కొడంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కోస్గి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ ల్యాండ్రీ షాపులో ఇస్త్రీ చేసి ఓట్లను అభ్యర్థించారు.

- కోస్గి



ఓట్లు పండాలి!

మిడ్జిల్ మండలం రాయినోనికుంట తండాలో జడ్చర్ల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వ్యవసాయ పొలాల్లో కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించారు.

- మిడ్జిల్

ప్రచారంలో మేము సైతం..



పాఠశాలలకు సెలవు కావడంతో మూసాపేట మండలం నందిపేటలో చిన్నారులు పార్టీ జెండాలను పట్టుకుని ప్రచారంలో పాల్గొనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

- అడ్డాకుల



ఓట్లు 'దోశే'స్తాం..

పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో బీఆర్ఎస్ కొల్లాపూర్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి తరఫున సర్పంచ్ మౌనికాయాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఓ హోటల్‌లో దోశలు వేసి ఓటర్లను ఆకర్షించారు.

- పాన్‌గల్

నల్లమల.. సమస్యల ముల్లె

ఉన్నత విద్య అందుబాటులో లేక విద్యార్థుల అవస్థలు

- డిండి కుడి కాల్వతో రైతులకు అందని సాగునీళ్లు
- జినుకుంట లెదర్ పార్కు మూతతో కార్మికులకు ఉపాధి కరువు
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో పలు విషయాలు వెలుగులోకి..
- కాబోయే ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

అచ్చంపేట: నల్లమలలో సహజ వనరులు పుష్కలం. అటవీ ఉత్పత్తులతో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతం. విస్తారంగా ఉన్న వెదురు, తనికాకు, సున్నపు పరిశ్రమలతో పాటు అగరబత్తీలు, గమ్, షాంపో, అగ్గిపెట్టెలు, చీపుర్లు వంటి పరిశ్రమలు నెలకొల్పలేకపోవడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయి. అచ్చంపేట సెగ్మెంట్‌లో గత ప్రభుత్వాలు కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాబోయే ఎమ్మెల్యేకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అచ్చంపేట పట్టణంతో పాటు మండలం, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల, వంగూరు, చారకొండ మండలాలు నియోజకవర్గంలో ఉన్నాయి. మొత్తం 2,33,738 మంది ఓటర్లు ఉండగా.. 1,17, 124 మంది పురుషులు, 1,16,439మంది మహిళలు, ఇతరులు ఇద్దరు, 173మంది సర్వీస్ ఓటర్లు ఉన్నా రు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఉన్నత విద్య దూరం..

నల్లమల ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అచ్చంపేటలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలతో పాటు మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. పట్టణ వాసులు సేద తీరేందుకు పార్కులు లేవు. ఇండోర్ స్టేడియం, ఎన్టీఆర్ మినీ స్టేడియం వంటివి అసంపూర్తిగా మిగిలిపోయాయి. కూరగాయలు, మాంసం మార్కెట్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వంద పడకల ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మల్లంకుంట ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అదనపు నిధుల మంజూరులో జాప్యంతో పనులకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే రూ. 1.30కోట్లు ఖర్చు చేసినా ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. హాజీపూర్, సిద్ధాపూర్‌లను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కృష్ణానదిపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

సాగునీటి కల సాకారమయ్యేనా?

సముద్ర మట్టానికి 684 మీటర్ల ఎత్తులో ఉన్న అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. 30ఏళ్లుగా మానవద్దవాగు, ధారవాగు ఎన్నికల హామీలుగానే మిగలగా.. సాగునీటి సాధన సమితి పోరాటం, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్ఎల్‌బీసీ ఎత్తిపోతల పథకంలో భాగంగా మధ్య డిండి ద్వారా సాగునీటి విడుదలకు ఆమోదం లభించింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2017లో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు రూ.354 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వివిధ కారణాల వల్ల మిడ్ డిండిని ఎత్తివేయడంతో అమ్రాబాద్ ఎత్తిపోతల పథకం ప్రశ్నార్థకంగా మారింది. 2018 ఎన్నికల్లో అప్పర్ ప్లాట్‌కు సాగునీరు అందించేందుకు ఉమామహేశ్వర ప్రాజెక్టు, చెన్నకేశవ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. నల్లమల పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందాల్సి ఉంది. మద్దిమడుగు–మాచర్ల మధ్య కృష్ణానదిపై అంతర్‌రాష్ట్ర బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

లింగాల మండలంలో..

లింగాలలో బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలిస్తూ విస్మరిస్తున్నాయి. ఎంజీకేఎల్ఐ ద్వారా అప్పాయిపల్లి, చెన్నంపల్లి, పద్మనపల్లి గ్రామాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. మూరుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాల్సి ఉంది. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల సేకరణకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నెరవేరని బల్మూర్ ప్రజల కల..



మూతపడిన జినుకుంట లెదర్ పార్కు

బల్మూర్ మండల ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు కలగానే మారాయి. 2018 ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అచ్చంపేట ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్లు పూర్తయి, ఉమామహేశ్వర రిజర్వాయర్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2011లో ఏర్పాటు చేసిన జినుకుంట లెదర్ పార్కు పునరుద్ధరిస్తే.. చర్మకారులకు ప్రయోజనం చేకూరుతుంది. చెన్నై లీడ్ క్యాప్ సంస్థలో 200మంది చర్మకారులు శిక్షణ పొందగా.. పరిశ్రమ మూతతో కార్మికులకు ఉపాధి కరువైంది. లెదర్ పార్కును ప్రారంభిస్తే వందలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బల్మూర్‌లో పీజీ కళాశాల, రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి.

డిండి కాల్వతో దక్కని ఫలితం..

ఉప్పునుంతల మండల రైతాంగానికి డిండి ప్రాజెక్టు కుడి కాల్వ సాగునీరు అందించలేకపోతోంది. సాగునీటి విషయంపై రైతులు ప్రతి ఏటా పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నలగొండ జిల్లా రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతోంది. లత్తీపూర్, వడ్డెర గుడిసెలు, గువ్వలోనిపల్లి గ్రామాల్లో 325 ఎకరాలకు సాగునీరందించేందుకు పదేళ్ల కిందట 7కి.మీ. మేర కాల్వ ఆధునీకరణకు రూ.1.50 కోట్లు(జపాన్ నిధులు) మంజూరు కాగా.. 5కి.మీ. కాల్వను ఆధునీకరించారు. పాత కాల్వ మరమ్మతుతో పాటు సిమెంట్ కాంక్రీట్ నిర్మించారు. డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులు కాగా.. 16 అడుగుల వరకు మాత్రమే నీరందించే విధంగా కుడి కాల్వ తీశారు. దీంతో ఒక పంటకు కూడా నీరు అందడంలేదు. రైతులు ప్రతి ఏడాది పంటసాగుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉప్పునుంతలలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మొల్గర దుందుభీ వాగుపై హైలేవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిధులు మంజూరైనా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు.



గువ్వలోనిపల్లి సమీపంలో డిండి ప్రాజెక్టు కుడి కాల్వ దుస్థితి

అసంపూర్తిగా డీఎల్ఐ కాల్వలు..

పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా వంగూరు మండలంలో చేపట్టిన డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇందుకోసం 9 గ్రామాల్లో 1500 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి, పనులు పూర్తిచేసి సాగునీరు అందించాల్సి ఉంది. పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో పోలీస్ క్వార్టర్స్‌లో కొనసాగుతోంది. నూతన భవనం నిర్మించాల్సి ఉంది.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మించాలి..



మద్దిమడుగు నుంచి కృష్ణానది వరకు బండ్ల మార్గం మాత్రమే ఉంది. పబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఏపీ ప్రజలు వస్తుంటారు. మాచర్ల, మద్దిమడుగు, ఇప్పలపల్లి, మారడగు గ్రామాల ప్రజలు ప్రమాదమని తెలిసినా కృష్ణానదిపై పుట్టీల ద్వారా అవతలి ఒడ్డుకు వెళ్తారు. మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మించడం వల్ల తెలుగు రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. - గేమ్యానాయక్, ఇప్పలపల్లి, పదర మండలం

నీళ్లు ముందుకు వెళ్లడం లేదు..



డిండి ప్రాజెక్టు కుడి కాల్వ పనులు నాసిరకంగా చేపట్టారు. తీగలకుంట కింద సిమెంట్ కాల్వ ఎత్తు లేకపోవడంతో నీళ్లు వాగులోకి చేరుతున్నాయి. గువ్వలోనిపల్లి సమీపంలో కాల్వ సరిగాలేక ముందుకు నీళ్లు వెళ్లడంలేదు. కుడి కాల్వ వెంట ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పంటలకు నీరందలేదు. కాల్వ నీటిపై రైతులు పూర్తిగా ఆశలు వదులుకున్నారు. - దాసరి కృష్ణయ్య, రైతు, లత్తీపూర్

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి..



లింగాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. మండలంలో గిరిజన విద్యార్థులు అధికంగా ఉన్నారు. ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కొందరు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. - శ్రవణ్‌కుమార్, అవుసలికుంట, లింగాల మండలం

శిక్షణ తీసుకున్నాం..



2003లో జినుకుంట లెదర్ పార్కు ఏర్పాటు చేసిన తర్వాత చైన్నైలో శిక్షణ తీసుకున్నాం. చెప్పుల తయారీకి శిక్షణ తీసుకోగా.. పరికరాలు కూడా ఇచ్చారు. లెదర్ పార్కు మూతపడి మాకు ఉపాధి లేకుండా పోయింది. ఏళ్లు గడుస్తున్నా తెరవడం లేదు. ఉపాధి లేక చర్మకారులు వలస వెళ్తున్నారు. - ఎల్లస్వామి, శిక్షణ పొందిన చర్మకారుడు, గోదలు, బల్మూర్ మండలం

పేర్లు, గుర్తులతో తికమక



కొల్లాపూర్: ఎన్నికల్లో ఎత్తులకు పై ఎత్తులు.. ఓటర్లను తికమక పెట్టే చర్యలు సహజంగా మారిపోయాయి. కొల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇవి మరోసారి వెలుగు చూస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో ఒకే పేరు కలిగిన అభ్యర్థులు ముగ్గురు ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాల్లో కోరిన గుర్తులు కూడా దాదాపుగా ఒకే రకంగా ఉన్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నామినేషన్ వేయగా.. అలయెన్స్ డెమక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా నల్గొండ జిల్లా తిరగండ్లపల్లెకు చెందిన కీసరి హర్షవర్ధన్‌రెడ్డితో పాటు హైదరాబాద్ చైతన్యపురికి చెందిన ఎల్లేని హర్షవర్ధన్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా కొల్లాపూర్‌లో నామినేషన్ వేశారు. ఈ మూడు పేర్లు ఒకేలా ఉండటం చర్చనీయాంశంగా మారింది. స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది రోడ్ రోలర్, ఆటోరిక్షా, ఎయిర్ కండీషనర్, కంప్యూటర్, సిలిండర్, ట్రాక్టర్ గుర్తులను కోరుకున్నారు. ఇవన్నీ ఇంచుమించుగా కారు గుర్తుకు దగ్గరి పోలికలు ఉండేవే. ఓటర్లను కన్ఫ్యూజ్ చేసేందుకు స్వతంత్రులు బరిలో దిగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

విరిగిన 15 స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు



అన్నారెడ్డిపల్లిలో చెరుకు లారీ తగిలి కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు

- చెరుకు లారీ తీగలకు తగలడంతో సంఘటన
- విద్యుత్ సరఫరా లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

మహమ్మదాబాద్: రైతు పొలం నుంచి చెరుకు లోడ్‌తో వెళ్తున్న లారీకి విద్యుత్ స్తంభాల తీగలు తగిలి వరుసగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దిమ్మెల పైనుంచి కింద పడి, స్తంభాలు విరిగిన సంఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అన్నారెడ్డిలో ఓ రైతు పొలంలో చెరుకు కోసుకుని లారీకి లోడ్ చేశారు. అటు నుంచి రోడ్డు పైకి వచ్చి వెళ్తున్న లారీకి పైనున్న విద్యుత్ తీగలు తగిలాయి. గమనించకుండా లారీని తోలడంతో 15 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి. దీంతో 20 మంది రైతుల వరకు బోరుమోటార్లు నడవకుండా నిలిచిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని రైతులకు పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలియజేశారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ లైన్ పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

నగదు, మద్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి



బాలానగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్ర అన్నారు. బాలానగర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ బృందం తనిఖీ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ ఇతర వివరాలపై ఆరా తీశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మద్యం, నగదు తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగదు సీజ్

అమరచింత: మండలంలోని మస్తీపురం క్రాస్‌రోడ్డులో ఆదివారం ఎస్ఎస్‌టీ టీం–6 ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆత్మకూర్ మండలం జూరాలకు చెందిన కుర్వ నర్సింహులు రూ.3లక్షల 80వేల నగదు తరలిస్తుండగా, పట్టుకుని నారాయణపేట గ్రీవెన్స్ సెల్‌కు పంపించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఎస్ఎస్‌టీ టీం లీడర్ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ వలీ ఉన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. యాద్గీర్ పట్టణానికి చెందిన కిరణ్ తన కారులో రూ.లక్ష 90వేల నగదును తరలిస్తుండగా, పట్టుకుని నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత రంగారెడ్డి



బాలుర విజేత రంగారెడ్డి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పాపిరెడ్డి తదితరులు

- రెండు విభాగాల్లో చాంపియన్‌గా నిలిచిన జట్లు
- రన్నరప్‌గా వరంగల్, ఖమ్మం.. మూడోస్థానంలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రంగారెడ్డి బాల, బాలికల జట్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి.. రెండు విభాగాల్లో చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 35– 23 పాయింట్ల తేడాతో వరంగల్ జట్టుపై, బాలికల ఫైనల్‌లో రంగారెడ్డి జట్టు 36– 16 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించాయి. బాలబాలికల విభాగాల్లో మూడోస్థానంలో హైదరాబాద్ జట్లు నిలిచాయి.

అందరి సహకారంతోనే..

వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల సహకారంతో రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి అన్నారు. టోర్నీలో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నీలో జట్లు ఎంతో మెరుగైన ప్రదర్శన కనబరచాయన్నారు. త్వరలో జరిగే అండర్–19 ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాల, బాలికల జట్లు రాణించి చాంపియన్లుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ పీడీ డాక్టర్ శ్రీనివాస్, బాస్కెట్‌బాల్ టోర్నీ రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి, రమేష్, అండర్–17, 14 విభాగాల ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి నసీరుల్లా హైదర్, కోచ్ ఎండీ ఖలీల్, పీడీలు వడెన్న, రామచందర్, రాజవర్ధన్‌రెడ్డి, పీఈటీలు ముకర్రం, అఫ్రోజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక

అండర్–19 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. రాష్ట్ర బాలుర జట్టులో విదూర్ రెడ్డి, చంద్రచూర్, రాం అగర్వాల్, వి.సాకేత్ (రంగారెడ్డి), సుధాకర్, ఎ.చంద్రశేఖర్, శ్యాం (వరంగల్), సిద్దార్థ, డేనియల్ వాస, టీఎన్ శ్రీనివాస్ (హైదరాబాద్), విశ్వక్ రెడ్డి, మహ్మద్ అబ్దుల్ రఫె (మహబూబ్‌నగర్) ఉన్నారు.

- రాష్ట్ర బాలికల జట్టులో అమృత, హర్షిత, దీపాలి అమూల్య, ఆకాంక్షరెడ్డి (రంగారెడ్డి), రామలాస్య, భాను స్పందన, రిషిక (ఖమ్మం), జీఎం శ్రీహర్షిత, శ్రీజైత్రి (హైదరాబాద్), నవ్యశ్రీ చౌహాన్ (వరంగల్), శ్రీలత, వర్షిణి (మహబూబ్‌నగర్) ఉన్నారు.
- మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియం రాష్ట్రస్థాయి క్రీడాటోర్నీల నిర్వహణకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. అలాంటి మెయిన్ స్టేడియంలో ఆదివారం ఒకే రోజు రెండు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడాటోర్నీలు ముగిశాయి. ఇదే మైదానంలో ఒక పక్క హ్యాండ్‌బాల్, మరోపక్క బాస్కెట్‌బాల్ టోర్నీలు జరగడం విశేషం.

అమెరికాలో చదువే టాప్ చాయిస్

అమెరికాలో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థుల క్యూ...

- 2022–23 విద్యా సంవత్సరంలో యూఎస్ వెళ్లిన 2,68,923 విద్యార్థులు
- గత విద్యా సంవత్సరంతో పోలిస్తే 35% పెరుగుదల
- అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో 25 శాతం భారతీయులే
- వెల్లడించిన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: కొలువులు, చదువుల కోసం మనోళ్లు విదేశాలకు క్యూ కడుతూనే ఉంటారు. అయితే, విదేశాల్లో విద్యాభ్యాసానికి భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్‌గా మాత్రం అమెరికానే ఉంటోంది. యూఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రితం విద్యా సంవత్సరంతో పోలిస్తే.. 2022–23 విద్యా సంవత్సరంలో 35 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. 2022–23లో అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు 2,68,923 మంది విద్యార్థులు వెళ్లినట్టు సోమవారం విడుదలైన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ (ఓడీఆర్) నివేదికలో వెల్లడైంది. ఈ నివేదికలోని వివరాలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయం తమ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న 10 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయ విద్యార్థులే అని ఓడీఆర్ వెల్లడించింది.

63 శాతానికి చేరిన గ్రాడ్యుయేషన్ విద్యార్థులు..

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ డేటా ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్యలో భారత్ చైనాను అధిగమించింది. క్రితం సంవత్సరంతో పోల్చితే 2022–23 విద్యా సంవత్సరంలో భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 63 శాతం పెరిగి 1,65,936 మందికి చేరుకుంది. దాదాపు 64,000 మంది విద్యార్థులు పెరిగారు. అదే సమయంలో భారతీయ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సైతం 16 శాతం పెరిగారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)ను అభ్యసించే వారి సంఖ్య 69,062కు చేరడంతో అమెరికాలో విద్యాభ్యాసం చేసే విదేశీ విద్యార్థుల్లో భారత్ అగ్రగామిగా నిలిచింది. ఓపీటీ అనేది ఒక రకమైన తాత్కాలిక పని అనుమతి. ఇది అర్హత కలిగిన విద్యార్థులు వారి అధ్యయన రంగానికి సంబంధించిన అనుభవాన్ని పొందడానికి అక్కడ విద్యాభ్యాసం చేసేందుకు ఈ విధానంలో అనుమతి లభిస్తుంది.

ఈ ఏడాది జూన్–ఆగస్టులో అత్యధిక వీసాలు జారీ..

అమెరికా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులకు ఎఫ్, ఎం, జే కేటగిరీల్లో వీసాల జారీ సైతం ఈ ఏడాది జూన్–ఆగస్టులో గణనీయంగా పెరిగింది. భారత దేశవ్యాప్తంగా ఉన్న యూఎస్ కాన్సులేట్, ఎంబసీల ద్వారా మొత్తం 95,269 వీసాలు జారీ అయ్యాయి. 2022లో జూన్–ఆగస్టులో జారీ చేసిన వీసాలతో పోలిస్తే ఇది 18 శాతం అధికం.

అమెరికాలో చదువు అంటే విలువైన పెట్టుబడే..



'అమెరికాలోని యూనివర్సిటీల్లో విద్యా భ్యాసం అన్నది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఓ విలువైన పెట్టుబడి లాంటిదే. ఉజ్వల భవిష్యత్తు దిశగా ఈ విద్యార్థులంతా యూఎస్, భారత్‌ను మరింత దగ్గర చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు విద్యార్థులను సిద్ధం చేసే భారతీయ విద్యా వ్యవస్థ బలం హర్షణీయం. విద్యాభ్యాసం కోసం యూఎస్ వచ్చే విద్యార్థుల్లో మహిళల సంఖ్య మరింత పెరగాలని మేం ఆశిస్తున్నాం'.

– యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి

ఉచిత సలహా కేంద్రాలు..

అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైల్లో ఒక్కొక్కటి, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు కలిపి మొత్తం ఆరు కేంద్రాలు ఉన్నాయి. అమెరికాలో విద్యాభ్యాసంపై వివరాల కోసం ఎడ్యుకేషన్‌యూఎస్‌ఏ ఇండియా యాప్ సైతం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లలో అందుబాటులో ఉన్నట్టు యూఎస్ ఎంబసీ అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో కళాశాల దరఖాస్తు ప్రక్రియ గురించి తాజా సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. https://educationusa.state.gov/country/in. వెబ్‌సైట్‌లోనూ పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల జోరు ఇలా...

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక	2021-21 విద్యా సంవత్సరం	2022-23 విద్యా సంవత్సరం	పెరుగుదల (%)
యూఎస్‌కు వెళ్లిన మొత్తం భారతీయ విద్యార్థులు	1,99,182	2,68,923	35
అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు	27,545	31,954	16
గ్రాడ్యుయేషన్ విద్యార్థులు	1,02,024	1,65,936	62.6
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)	68,188	69,062	1.3

'ఆల్మట్టి'పై పునరాలోచన చేయాలి

- ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీలు మళ్లిస్తే తెలంగాణకు నష్టం
- జూరాల, శ్రీశైలంకు వచ్చే వరద ప్రవాహానికి గండి పడుతుంది
- కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు ఉల్లంఘన
- నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ డీజీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా.. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నుంచి ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆ రాష్ట్రానికి 16 టీఎంసీలను కేటాయించాలనే ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలతో ఆల్మట్టి జలాశయం నుంచి దిగువన ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలకు గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనలపై పునరాలోచన చేయాలని కోరింది. నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ నెల 10న హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తెలంగాణ వాదనలను పేర్కొంటూ అదే రోజు ఎన్‌డబ్ల్యూడీఏకు లేఖ రాశారు.

ఆ హక్కు కర్ణాటకకు లేదు

ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆల్మట్టి నుంచి కర్ణాటకలోని మల ప్రభ సబ్ బేసిన్‌కు 16 టీఎంసీల కేటాయింపుతో జల నిబంధనల అమలులో పూర్తి సంక్లిష్టమైన పరిస్థితులు ఉత్పన్న మవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్–1 గంపగుత్తగా జరిపిన కేటాయింపుల మేరకు జూరాల, శ్రీశైలం జలాశయాలకు రావాల్సిన జలాలను వినియోగించుకునే హక్కు కర్ణాటకకు లేదని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్ పరిధిలోని సాగునీరు అందని ప్రాంతాలు పెద్ద ఎత్తున ఉండగా, వాటిని విస్మరించి కృష్ణా జలాలను పెన్నా బేసిన్‌కు తరలించడం సబబు కాదని ఆక్షేపించారు. గోదావరి బేసిన్ లోని 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి సంబంధించి రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని, ఈ ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిన తర్వాతే నదుల అనుసంధానం విషయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించడంతో సాగర్‌లో కృష్ణా జలాల నిల్వలపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో 30లక్షల ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 20.3లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 12.2 లక్షల ఎకరాలకు ఇంకా సాగునీరు అందలేదని వివరించారు. ఈ మూడు జిల్లాల్లో సాగుకు యోగ్యమైన 86శాతం భూములకు సాగునీటి సదుపాయం లేదని పేర్కొన్నారు.

50% జలాలు కేటాయించాలి...

గోదావరి–కావేరి, బెడ్తి–వార్ధా నదుల అనుసంధానంతో తరలించనున్న 166 టీఎంసీల్లో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కోరగా, కేవలం 45 టీఎంసీలు(27శాతం) మాత్రమే కేటాయించినట్టు ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. కేటాయింపులను 50శాతానికి పెంచాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పులోని 15(బీ) నిబంధన మేరకు బెడ్తి–వార్ధా నదుల అనుసంధానం ద్వారా తరలించనున్న 18 టీఎంసీల్లో 50శాతం .. అంటే 9టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని తెలిపారు. ఇచ్చంపల్లి వద్ద నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి గోదావరి జలాలను తరలించాలని సూచించారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని 148 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలించనున్నట్టు కేంద్రం పేర్కొంటున్న నేపథ్యంలో.. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి తీసుకోవాలని కోరారు.

ఏపీలో కుల గణనకు నాంది

రేపు 5 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కుల గణన ప్రారంభం

- 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో మొదలు
- రెండు రోజులు ప్రయోగాత్మకంగా కుల గణన
- కుల గణనపై ఈ నెల 22 వరకు శిక్షణ
- బుధవారం నుంచే జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు
- విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు బుధవారం నాంది పలకనుంది. రాష్ట్రంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా కుల గణన చేపట్టనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాల్లో మూడు గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుంది. సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడానికి ఈ నెల 3న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కుల గణన ముందస్తు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి ఎం. గిరిజా శంకర్ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న వివిధ శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు తెలియజేస్తూ యూవో నోట్ విడుదల చేశారు. ముందస్తుగా ఐదు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో అవసరమైతే మార్పులు చేసి, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టనున్నట్లు సమాచారం.

సిబ్బందికి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా కుల గణనలో ఎన్యూమరేటర్లుగా వ్యవహరించే సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ చేసే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు మూడు విడతల్లో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో మంగళ, లేదా బుధవారం శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచే రౌండ్ టేబుల్ సమావేశాలు

కుల గణనపై ప్రభుత్వం బుధవారం నుంచి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత భాగస్వామ్యులతో ఈ సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఐదు ప్రాంతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు జరపనున్నారు. ఈ నెల 17న రాజమండ్రి, కర్నూలులో, 20న విశాఖ, విజయవాడలో, 24న తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రాంతీయ సదస్సులు జరిగే ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండవని రాష్ట్ర ప్రణాళిక శాఖ స్పష్టం చేసింది.

నేడు అల్పపీడనం!

16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 16వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే ఏపీపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. కాగా.. మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అలాగే బుధవారం తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



కొండయ్య (ఫైల్)

గండేడ్: అప్పుల బాధతో వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మంగి కొండయ్య(40) మేకలు మేపుతూ జీవనం గడిపేవాడు. మూడేళ్ల కిందట ఇల్లు కట్టడానికి మేకలు అమ్మి, మరికొంత అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. ఇల్లు కోసం ఉన్న కొద్ది పాటి భూమిని కూడా అమ్మేసుకున్నాడు. దీంతో అప్పులు ఎక్కువయ్యాయి. చేసేది లేక రెండేళ్ల కిందట కుటుంబాన్ని తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లాడు. భార్యాభర్తలు తోటలో పనిచేయగా.. కుమారుడు ఆనంద్ రోజు వారీ అడ్డా కూలిగా పనిచేసేవాడు. సాయంత్రం రాగానే రొట్టెల విక్రయం కూడా చేసేవాడు. ఈ క్రమంలో కొండయ్యకు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మానసిక ఒత్తిడి తట్టుకోలేక గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా లింగంపల్లి సమీపంలో తెల్లాపూర్ రైల్వేలైన్‌లో వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని వికారాబాద్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. ఈ విషయం తెలియని కుటుంబ సభ్యులు కొండప్ప కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీరా ఆత్మహత్య చేసుకుంది కొండప్ప అని తెలియడంతో శనివారం వికారాబాద్ వెళ్లి మృతదేహం తీసుకువచ్చి స్వగ్రామం వెన్నాచేడ్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

కావేరమ్మపేటలో యువకుడు..

జడ్చర్ల: కావేరమ్మపేటకు చెందిన యువకుడు ముష్టి శశికుమార్(25) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తమ ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధ పడుతున్నట్లు సమాచారం. కుమారుడు మృతితో తల్లిదండ్రులు పద్మమ్మ, వెంకటయ్యలో శోకసంద్రంలో మునిగారు. ఆత్మహత్యకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి సోమవారం రాత్రి 7 గంటల వరకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 88, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో మొత్తం 2,809 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.740 టీఎంసీల ఉన్నట్లు తెలిపారు.

బ్రహ్మాండనాయక.. కురుమూర్తిరాయ..



కురుమూర్తిస్వామి ప్రధాన ఆలయం



విద్యుత్ దీపాల వెలుగులో రాజగోపురం

- నేటి నుంచి కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమావాస్య మరుసటి రోజు పాడ్యమిని పురస్కరించుకొని నిర్వహించే స్వామివారి ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. దీంతో స్వామి కాంచనగుహ గోవింద నామస్మరణతో మార్మోగుతుంది.

ఏర్పాట్లు పూర్తి..

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా రంగులు అద్దే పనులు పూర్తి కాగా.. విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. స్వామివారు విహరించే వాహనాలను ఆలయ అర్చకులు సిద్ధం చేశారు. అక్కడక్కడ హైమాస్ట్ లైట్లు, వీధీదీపాల ఏర్పాటుతో పాటు విద్యుత్ అంతరాయం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర మైదానంలో మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచారు. భక్తులకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయ ముఖద్వారం నుంచి ఉద్దాల గుండు వరకు బారికేడ్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

18న ఆభరణాల అలంకరణ..

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం అలంకారోత్సవాన్ని 18న అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ముకెర వంశస్థులు బహుకరించిన ఆభరణాలను నెల రోజులపాటు స్వామివారికి అలంకరించడం ఈ ఉత్సవ ప్రత్యేకత. వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని ఎస్‌బీఐ లాకర్‌లో భద్రపరిచిన స్వామివారి బంగారు ఆభరణాలను పోలీస్ బందోబస్తు మధ్య కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాల మీదుగా అమ్మాపురం సంస్థానాధీశులు రాజ శ్రీరాంభూపాల్ ఇంటికి చేరుస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంబోరు మధ్య కాలినడకతో కురుమూర్తి గిరులకు తరలిస్తారు.

19న ఉద్దాల మహోత్సవం..

స్వామివారి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం ఉద్దాల మహోత్సవం. చిన్న వడ్డేమాన్‌లో దళితులు వారం రోజులపాటు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అప్పంపల్లి, తిర్మలాపూర్ గ్రామాల మీదుగా ఊరేగింపుగా కురుమూర్తి గిరులకు తరలిస్తారు. ఈ ఊరేగింపులో శివసత్తుల ఆటపాటలు, గోవింద నామస్మరణ మార్మోగుతాయి. ఉద్దాల ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు.

బ్రహ్మోత్సవాల్లో రోజువారీ కార్యక్రమాలు..

- 14న ధ్వజారోహణం, దేవాతాహ్వానం, భేరి పూజ, అష్టోత్తర శత కలశాభిషేకం, స్వామి వారి కల్యాణోత్సవం, మహానివేదన, మంగళ నీరాజనం, సాయంత్రం 6:15 గంటలకు భూసమేత స్వామివారి మయూర వాహన సేవ నిర్వహించనున్నారు.
- 15న సాయంత్రం 6:20 గంటలకు భూసమేత స్వామివారి హంసవాహన సేవ.
- 16న శేష వాహన సేవ.
- 17న గజవాహన సేవ
- 18న సాయంత్రం 5:30 గంటలకు స్వర్ణాభరణాలతో అలంకారోత్సవం. రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ.
- 19న సాయంత్రం 6:30గంటలకు ఉద్దాల ఉత్సవం. రాత్రి 9:10 గంటలకు హనుమద్వాహన సేవ. 10:47 గంటలకు గరుడవాహన సేవ.
- 20న పుష్పయాగం, ప్రత్యేక పూజలు.
- 21న ప్రత్యేక పూజలు.
- 29న ఉదయం 9:45 గంటలకు అలంకరణ ఆభరణాలు తీస్తారు. అనంతరం జాతర ఉత్సవాలు కొనసాగుతాయి.

బాణసంచా దుకాణంలో అగ్ని ప్రమాదం



కాలి బూడిదయిన బాణాసంచా దుకాణం

కొత్తకోట రూరల్: దీపావళిని పురస్కరించుకొని బాణాసంచా విక్రయించేందుకు పట్టణ సమీపంలో తడకలు, రేకులతో ఆరు షెడ్లను ఏర్పాటు చేశారు. ఈ షెడ్లలోని ఓ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన నిర్వాహకుడు వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో ఫైర్ సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. షాపులో గల వస్తువులన్నీ పూర్తిగా కాలిబూడిదయ్యాయి. షాపు యజమానికి రూ.5లక్షల వరకు నష్టం వచ్చిందని వాపోయాడు. బాణసంచా దుకాణాల్లో ఫైర్ నియంత్రణ జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మంటలు చెలరేగాయని, ఫైర్ అధికారులు పనితీరుపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఫైర్ అధికారులు సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు, దుకాణాలు పెట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడంతో పాటు దుకాణాల వద్ద ఫైర్ ఇంజన్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

నీటి ట్యాంకర్ కిందపడి బాలుడి దుర్మరణం

జడ్చర్ల: తాగునీటి ట్యాంకర్ టైర్ కింద ఓ బాలుడు పడి మృతిచెందిన సంఘటన స్థానిక సాయినగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. తాగునీటి ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుని తిరిగి వెళ్తున్న సమయంలో తండ్రి వెంట వచ్చిన కుమారుడు యెక్షిత్(04) వెనక్కి వస్తున్నాడు. అదే సమయంలో ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని వెనక్కి తీశాడు. తండ్రి వెంటే పరిగెడుతున్న కుమారుడు యెక్షిత ట్యాంకర్ వెనుక టైరు కింద పడిపోయాడు. వెంటనే గమనించిన తండ్రి కుమారుడిపై నిలిచిన టైర్‌ను కదిలించే ప్రయత్నం చేశాడు. ఒకటి, రెండు సార్లు వాహనం ముందు వెనక్కి జరిగిన తరువాత బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ప్రవళిక, మనోహర్ ఒక్కసారిగా రోదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా, ఆత్మకూర్‌కు చెందిన వీరు పోలేపల్లి సెజ్‌లోని హెటిరో ఫార్మలో పనిచేస్తున్నారు. సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేశ్‌బాబు తెలియజేశారు.

పండుగపూట యువతి దారుణహత్య

- యువతిని నరికి, నిప్పు పెట్టిన వైనం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కోస్గి: గుర్తు తెలియని ఓ యువతిని రోడ్డు పక్కన పెట్రోల్ పోసి నిప్పంటించి దహనం చేసిన ఘటన గుండుమాల్ మండలంలోని ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గుండుమాల్ మండలంలోని బోగారం శివారులో వాగు పక్కన ఓ గుర్తు తెలియని యువతి శరీరం పూర్తిగా కాలిపోయి భాగాలుగా పడి ఉండటాన్ని అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జనార్దన్, ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో వెళ్లి ప్రాథమిక పంచనామా నిర్వహించారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న యువతిని పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు గుర్తించారు. నిప్పంటిచడంతో శరీరం గుర్తు పట్టని విధంగా మారింది. డాగ్ స్క్వాడ్‌తోపాటు క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. కాగా దీపావళి రోజున ఓ యువతిని దారుణంగా నిప్పంటించి దహనం చేసిన ఘటన మండలంలో సంచలనం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు యువతికి నిప్పంటించి దహనం చేసినట్లు కేసు నమోదు చేసి, అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

114 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా బియ్యం తరలిస్తున్న డ్రైవర్ గోవిందు, ఓనర్ వీరన్న, ఎరుకలి నవీన్, హనుమంతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 2 వాహనాలను ఆదివారం కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు సోమవారం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల నుంచి రాయచూర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాలు వెళ్తున్నాయని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో డీసీఎంను కుచినెర్ల శివారులో గుర్తించి 90 క్వింటాళ్ల బియ్యంను పట్టుకున్నారు. అలాగే ధరూర్ నుంచి రాయచూర్‌కు వెళ్తున్న బొలెరొ వాహనాన్ని పాతపాలెం శివారులో పట్టుకున్నారు. ఈ రెండు వాహనాలను కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

చిన్నంబావి: అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దగడపల్లికి చెందిన ఒడే పార్వతమ్మ(50) గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. శనివారం ఆమె పాత ఇంటి వద్ద దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటి తలుపులు తెరవడంతో మహిళ మృతి చెంది పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.